ప్రజాశక్తి

బుధవారం 14 జూన్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

జాడలేని వానలు

పెరుగుతున్న వడగాల్పులు - అల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులు

మరో నాలుగు రోజులు ఇంతే - వాతావరణ శాఖ అంచనా

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రోహిణీ కార్తె ముగిసి వారం దాటింది. నైరుతీ రుతుపవనాలు రాష్ట్రంలోకి వచ్చాయని వార్తలు వచ్చాయి. అయినా వడగాల్పులు తగ్గలేదు. వర్షాల జాడలేదు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అడపాదడపా జల్లులు పడుతున్నా వేడిగాలుల తీవ్రత కొనసాగుతోంది. మరో నాలుగు రోజుల పాటు వడగాల్పులు ప్రభావం చూపనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి డా.బిఆర్ అంబేద్కర్ తెలిపారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో 15 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 20 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు.

మంగళవారం పల్నాడు జిల్లా రావిపాడులో 44.3 డిగ్రీ అత్యధిక

▸ 2లో

వడదెబ్బ తగిలి ఉపాధ్యాయిని మృతి 2 లో

అక్రమంగా పుస్తక విక్రయం

శ్రీచైతన్య కాలేజీ వద్ద నిలువరించిన విద్యార్థి సంఘాలు, అధికారులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని శ్రీచైతన్య కార్పొరేట్ పాఠశాలలో అనధికారికంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అమ్ముతున్నారని పలు విద్యార్థి సంఘం నాయకులు పాఠశాల వద్దకు మంగళవారం చేరుకుని పుస్తకాల అమ్మకాలను నిలిపివేశారు. పాఠశాలకు దూరంగా ఒక గదిలో పాఠ్యపుస్తకాలను నిల్వ చేసి అమ్ముతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు కోటా సాయి కుమార్, ఎఐఎస్ఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ బిలాల్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం జీవో నెంబర్ 94.1సి ప్రకారం విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలు అమ్మడం నేరమన్నారు. శ్రీ చైతన్య విద్యా సంస్థలు పుస్తకాలు అధిక రేట్లకు అమ్ముతున్నారని ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు నాయకులకు చెప్పారు. అనంతరం ఈ విషయాలను పిడుగురాళ్ల పట్టణ అసిస్టెంట్ కమిషనర్‌కు నాయకులు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకుంటామని ఆమె హామీనిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాయి, మధు పాల్గొన్నారు.

పుస్తక విక్రయ ప్రదేశం వద్ద నాయకులు

రోలర్ కింద నలిగి చిన్నారి దుర్మరణం

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

రోడ్డు రోలర్ కింద పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన పెదకాకాని మండలం కొప్పురావూరు అడ్డరోడ్డు వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తాడికొండకు చెందిన షేక్ మాబూ సుభాని గుంటూరు ఆటోనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై భార్య, చిన్నపిల్లాడితో కలసి తాడికొండ వెళ్తున్నాడు. కొప్పురావూరు అండర్ పాస్ బ్రిడ్జి వద్ద తారు రోడ్డు వేస్తుండగా పక్కనే ఉన్న చిన్నపాటి ఖాళీలో స్కూటీపై సుభాని బండిని పోనిస్తుండగా అది స్కిడ్ అయి పడిపోయింది. దీంతో సుభాని, అతని భార్య గౌసియా రోడ్డు పక్కన కింద పడగా మూడేళ్ల బాబు షేక్ సమీర్ రోడ్డుపైపడ్డాడు. అప్పటికే తారు రోడ్డును చదును చేస్తున్న రోడ్ రోలర్ బాలుడిపైకి ఎక్కింది. దీంతో బాలుడి అక్కడికక్కడే నుజ్జు అయ్యాడు. దీంతో సుభాని, గౌసియా కన్నీరు మున్నీరుగా విలపించారు. ఛిద్రమైన బాలుడి దేహాన్ని గౌసియా ఒళ్లో పెట్టుకుని విలపిస్తున్న తీరు అక్కడివారిని కలిచివేసింది. రోడ్డునిర్మాణం జరుగుతున్నందున చిన్నపాటి స్థలంలో వెళ్లవద్దని గౌసియా భర్తను వారిస్తున్నా ముందుకు వెళ్లడంతో బండి రోడ్డు అంచుకు తగిలి కింద పడటంతో ఈ దుర్ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. తాడికొండలో చిరు వ్యాపారం చేసుకుని జీవించే వీరిద్దరూ వ్యక్తిగత పనిమీద ఆటోనగర్ వచ్చారు. తిరిగి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. పెదకాకాని సిఐ బండారు సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహంతో విలపిస్తున్న తల్లి

నకిలీ పత్తి విత్తనాలు, బయో స్టిమ్యులెంట్స్ స్వాధీనం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

అనుమతులేమీ లేకుండా రాయచూర్ నుండి గుంటూరుకు తెచ్చి నకిలీ పత్తి విత్తనాలను విజిలెన్సు అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌టిసి కార్గో సర్వీసు ద్వారా వచ్చిన ఏడు బస్తాల విత్తనాలను నల్లూరి రాంబాబు అనే వ్యక్తి తెచ్చి విక్రయిస్తుండగా విజిలెన్సు డిఎస్‌పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అధికారులు గమనించి పరిశీలించగా వీటి నాణ్యత లేదని, నకిలీవని నిర్ధారించారు. రూ.2.38 లక్షల విలువ కలిగిన 40 విత్తనాల ప్యాకెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విఆర్‌ఎల్ పార్శిల్ ఆఫీసులో 200 లీటర్ల అనుమతులు లేని బయో స్టిమ్యులెంట్స్

▸ 2లో

తిమ్మాయపాలెం రెవెన్యూ పరిధిలోని చవిటి వాగు ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు మీరి తవ్విన మట్టి గుంతలు

అడ్డగోలుగా మట్టి తవ్వకాలు

- అనధికార లే అవుట్‌లకు భారీగా తరలింపు
- ఖాళీ ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో యధేచ్ఛగా తవ్వకాలు
- వాల్టా చట్టాన్ని మీరి భారీగా తవ్వకాలు
- ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని అధికారులు

2 లో

మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం దొంగదెబ్బ

విద్యుత్ ఛార్జీలను తగ్గించుకుంటే ఉద్యమం : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి వినియోగదారును దొంగదెబ్బ తీస్తోందని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు విమర్శించారు. స్థానిక మేకా అమరారెడ్డి భవన్‌లో మంగళగిరి - తాడేపల్లి సిపిఎం విస్తృత సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జెవి రాఘవులు అధ్యక్షత వహించగా రామారావు మాట్లాడుతూ విద్యుత్ వినియోగం రూ.100 అయితే సర్ ఛార్జీల పేరుతో రూ.200-300 వరకు భారం మోపుతున్నారని చెప్పారు. సగటున యూనిట్‌కు రూ.150 చొప్పున స్థిర ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఆలస్యానికి అదనపు రుసుము కూడా వేసి వచ్చిన బిల్లులు వినియోగదారుల మోత మోయిస్తున్నాయని ఆందోళన

▸ 2లో

వడదెబ్బ తగిలి ఉపాధ్యాయిని మృతి

సిఎం సభకు హాజరవడంతో తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా క్రోసూరులో సోమవారం జరిగిన సిఎంసభకు హాజరు అయిన ఒక ఉపాధ్యాయురాలు వడదెబ్బ తగిలి మృతి చెందిన ఘటన తెలిసింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరుకు చెందిన ఎం.పద్మావతి (52) అమరావతిలో నివాసం ఉంటున్నారు. లింగాపురం జెడ్‌పి పాఠశాలలో హిందీ టీచరుగా పనిచేస్తున్నారు. అధికారుల సూచనమేరకు సోమవారం క్రోసూరులో సిఎం సభకు 50 మంది విద్యార్థులను తీసుకువెళ్లారు. ఎండతీవ్రతకు ఆమెకు క్రోసూరులో వడదెబ్బ తగిలింది. మంగళవారం ఉదయం లింగాపురం పాఠశాలలో జగనన్న కిట్ల పంపిణీకి వెళ్లారు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్తతకు గురయ్యారు. పాఠశాలలోనే సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే ఆమెను అమరావతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తరువాత అమరావతి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపో యారు. మృతదేహాన్ని ఏలూరులోని స్వస్థలంకు పంపారు.

నకిలీ పత్తి విత్తనాలు, బయో స్టిమ్యులెంట్స్ స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి)

అమరావతిలో తయారు చేసినట్లుగా స్టిక్కర్లు అతికించి, పసుపులేటి ఆంజనేయ ప్రసాద్ పేరుతో రవాణా చేశారు. ఆ పేరుతో ఏ లైసెన్స్ లేకుండా బయో స్టిమ్యులెంట్స్‌ను వివిధ మార్గాల ద్వారా తెప్పించి అక్రమ వ్యాపారం చేయుచున్నట్లుగా అధికారులు గుర్తించారు. వీటి విలువ రూ.1.68 లక్షలు ఉంటుందన్నారు. విజిలెన్సు ఎస్‌పి కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖాధికారి వాసంతి, ఇన్‌స్పెక్టర్లు శ్రీహరిరావు, లక్ష్మారెడ్డి, తహశీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ వి.రామచంద్రయ్య పాల్గొన్నారు. అనుమతి లేని కంపెనీల విత్తనాలు కొని మోసపోవద్దని, విత్తనాలు కొనేముందు ప్రభుత్వ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గుంటూరు రీజనల్ అధికారి కె.ఈశ్వరరావు రైతులకు సూచించారు.

ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం దొంగదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఈ భారాలు మరో 24 నెలల పాటు మోయాల్సి ఉంటుందని చెప్పారు. ఇవి కాకుండా ప్రతినెలా ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.30-100 దాకా అదనపు భారం పడుతుందని, డిస్కమ్‌లకు వచ్చిన నష్టాల పేరుతో యూనిట్‌కు 40 పైసలు అదనంగా వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోకుంటే సచివాలయాలు, విద్యుత్ కేంద్రాల వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం పేదలకు స్థలం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే సెంటు స్థలం సరిపోదని, కనీసం రెండు సెంట్లు ఇవ్వాలని కోరారు. పేదలకు ఇప్పుడు నివశిస్తున్న ప్రాంతాల్లోనే ఇళ్లస్థలాలను రెగ్యులరైజేషన్ చేసి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయరకులు ఎం.రవి, ఎస్ఎస్.చెంగయ్య, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యకు పెరిగిన ప్రాధాన్యత : బాలవజ్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

విద్యార్థులకు చదువే ఆస్తి అని నమ్మి వారికి అన్ని విధాలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందని నగరడిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు అన్నారు. మంగళవారం 53వ డివిజన్‌లో లూర్దు హైస్కూల్

విద్యార్థులకు జెవికె కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు చేయూతనందించి వారిని చదువుకునేలా సిఎం జగన్ ప్రోత్సహిస్తున్నారని అన్నారు. వైసిపి నాయకులు షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలని సూచించారు.

అడ్డగోలుగా మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి - వినుకొండ

వందల సంఖ్యలో అనధికార వెంచర్లు.. వాటిని చదును చేసేందుకు అనుమతుల్లేకుండా వేల ట్రక్కుల మట్టి తరలింపు. వినుకొండ ప్రాంతంలో సుమారు 100కుపైగా అనధికార వెంచర్లు ఉన్నాయి. వీటన్నింటికీ ఎంత మంటి కావాలంటే అంత మట్టి చిటికలో వచ్చేస్తుంది. ఒక వెంచర్‌కు నాలుగు రోజుల్లో 5 వేల ట్రిప్పుల మట్టిని అక్రమంగా తరలించారు. అయితే అనుమతులు మాత్రం ఉండవు.

వినుకొండ ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రావెల్, ఎర్ర మట్టి ఏదైనా ఎన్ని ట్రాక్టర్లు, టర్బోలు కావాలంటే అన్ని రేయిబవళ్లు తవ్వి తరలిస్తున్నారు. వాల్టా చట్ట ప్రకారం చెరువు పొలాల్లో మట్టి తవ్వాలంటే రెవెన్యూ, గనుల శాఖ అనుమతి పొందాల్సి ఉన్నా అవేమీ లేకుండానే రూ.కోట్ల మట్టిని కాజేస్తున్నారు.

భూముల ధరలు పెరగడంతో వినుకొండ పట్టణంతో పాటు 15 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారులకు, ప్రధాన రహదారుల పక్కన అనధికారిక వెంచర్లు కోకొల్లలుగా వెలిశాయి. అధికార పార్టీ అండదండలతో కొందరు రియల్టర్లు వినుకొండ చుట్టూ అనధికారిక వెంచర్లు వేసి వ్యవసాయ భూములను సెంట్లు, గజాల పద్ధతిలో విక్రయిస్తున్నారు. భూమిని చదును చేసి వెంచర్లు వేసేందుకు మట్టి అవసరం కావడంతో ప్రభుత్వ ప్రైవేటు భూముల నుండి భారీగా మట్టిని తరలిస్తున్నారు.

మండలంలోని తిమ్మాయపాలెం రెవెన్యూ పరిధి, చవిటి వాగు పరివాహక ప్రాంతంలో ఆనుకొని ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో 10-15 అడుగుల లోతు గుంతలు తీసి వేల ట్రక్కులు తరలించారు. ఒక్కొక్క టర్బోకు రూ.6-8 వేలు వసూలు చేసుకుంటున్నారు. ఒక్కో వెంచర్‌కు సుమారు 6 వేల టర్బోలు తరలిస్తుండగా తద్వారా అక్రమార్కులకు రూ.35 లక్షలు వస్తోంది. ఈ భూముల నుండే సుమారు 25-30 వెంచర్ల వరకూ మట్టి తరలినట్లు సమాచారం. మట్టి తరలించేందుకు అడ్డుగా ఉందనే కారణంతో చవిటి వాగు ప్రాంతంలో చెక్ డ్యాం కట్టలనూ ధ్వంసం చేశారు. వెల్లటూరు రోడ్‌లోని సరికొండపాలెం వద్ద అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న భూముల్లో అక్రమంగా వేల ట్రక్కులు మట్టిని అమ్ముకున్నారు. ఈ ప్రాంతం నుండి వెల్లటూరు రోడ్డు, వినుకొండ పట్టణంలోని సుమారు 30 వెంచర్లకూ మట్టిని తరలించారని అంచనా.

శావల్యాపురం మండలం పిచికలపాలెం పరిధిలోని ప్రైవేటు, ప్రభుత్వ భూముల్లో నుండి అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఇటీవల వేల ట్రక్కుల మట్టిని అక్రమంగా తరలించారని తెలిసింది. వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని 25 వెంచర్లకు మట్టి తరలించి ఉండొచ్చని తెలుస్తోంది. బొల్లాపల్లి మండలం మూగచింతలపాలెం సమీపంలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి వినుకొండ ప్రాంతంలోని సుమారు 20 వెంచర్లకు తరలించినట్లు సమాచారం. అక్రమ తవ్వకాలకు నిదర్శనంగా పలు ప్రాంతాల్లో చెరువులను తలిపించే గుంతలు దర్శనమిస్తున్నాయి. వర్షాలొచ్చినప్పుడు ఈ గుంతల్లోకి నీరు చేరి అనేక మంది మృత్యువాత పడిన ఘటనలు అనేకం. పశువులు, ఇతర జీవాలు సైతం ఈ గోతుల్లో మృత్యువాత పడుతున్నాయి. వాగులు, చెరువులు, ప్రభుత్వ భూముల్లో మట్టి మాఫియా అడ్డగోలు తవ్వకాలు చేస్తున్నా రెవెన్యూ, భూగర్భ గనుల శాఖల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పలువురు ఫిర్యాదులు చేస్తున్నా వారిలో కదలిక లేకపోవడమూ పలు ఆరోపణలకు గురవుతోంది.

మంగళగిరిపాడులో సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- మేడికొండూరు

మేడికొండూరు మండల పరిధిలోని మంగళగిరి పాడు గ్రామ సచివాలయాన్ని గుంటూరు ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హేని క్రిస్టినా, తాడికొండ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు అనంతరం గ్రామంలో నిర్వహించిన సభలో హేని క్రిస్టినా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో జగనన్న ముందుకు వెళ్తున్నారని, గ్రామ సచివాలయ వ్యవస్థ వల్ల భారత దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. సచివాలయ సిబ్బంది కరోనా సమయంలో చేసిన సేవలు, అదేవిధంగా గ్రామ వాలంటీర్లు చేసిన సేవలు మరువలేనివి అన్నారు. సచివాలయ వ్యవస్థను ముందుకు తీసుకు వెళ్లేందుకే ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో గ్రామ సచివాలయలను నూతనంగా నిర్మించి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తున్నారన్నారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయలేని సంక్షేమ పథకాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రవేశపెట్టిందని దానికి అనుగుణంగా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో వైసిపి రాష్ట్ర చరిత్రనే తిరగరాస్తుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.సిద్ధయ్య ఎంపీపీ మనవ స్వప్న రాజేష్ వైసిపి మండల అధ్యక్షులు టి.వంశీ పాల్గొన్నారు.

రైతుల నడ్డి విరుస్తున్న పాలకులు

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రభుత్వాల విధానాలు రైతుల నడ్డి విరిస్తున్నాయని అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య అన్నారు. నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ అధ్యక్షులు పి.రామచంద్రయ్య అధ్యక్షత వహించగా వెంకయ్య మాట్లాడుతూ రైతుల సమస్యలను గుర్తించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు విఫలమయ్యారని, వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న సహకార వ్యవస్థను దెబ్బతీసేందుకు గుజరాత్‌కు చెందిన అమూల్‌ను ప్రోత్సహిస్తున్నారని, అయితే అమూల్‌ను కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు తిప్పి కొట్టాయని చెప్పారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఢిల్లీలో చేసిన ఉద్యమం మరువలేనిదన్నారు. విద్యుత్ సంస్కరణలను దేశంలో 11 రాష్ట్రాలు వ్యతిరేకించినా రాష్ట్రంలో అమలు చేయడానికి పూనుకున్నారని విమర్శించారు. అనంతరం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎన్.సౌరయ్య, గౌరవాధ్యక్షులు సి.హెచ్.జె ప్రతాప్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ విశ్రాంత డైరెక్టర్ ఎ.సత్యనారాయణ మాట్లాడారు. నాయకులు కాటమయ్య, జమలయ్య, జగన్నాథం, రంగారావు, మారుతి వరప్రసాద్, రాము పాల్గొన్నారు.

జాడలేని వానలు

(మొదటి పేజీ తరువాయి)

ఉష్ణోగ్రత నమోదైంది. యడ్లపాడు, పెదకూరపాడు, అమరావతిలో 43.6, అచ్చంపేట, క్రోసూరు, సత్తెనపల్లిలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గుంటూరు జిల్లా 17 మండలాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచాయి. అన్ని మండలాల్లో 43 నుంచి 44.2 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారమూ దాదాపు జిల్లా అంతటా వడగాల్పులు కొనసాగే అవకాశం ఉంది. పల్నాడు జిల్లాలో 20 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 8 మండలాల్లో వడగాల్పులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

రెండు జిల్లాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడిగాలుల తీవ్రత కనిపిస్తోంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీధుల్లో జనసంచారం తక్కువగా ఉంది. ఈ సమయంలో బస్టాండ్లలో ప్రయాణికులు సంఖ్య కూడా తక్కువగానే ఉంది. ఆర్‌టిసి బస్సులు మధ్యాహ్నం వేళ ప్రయాణికులు తక్కువ సంఖ్యతోనే ప్రయాణిస్తున్నాయి. మరోవైపు తెల్లవారుజామున ఐదు గంటల వరకు ఉక్కపోత ఎక్కువగా ఉంటోంది.

విద్యుత్ కోతలతో గ్రామీణ ప్రాంత వాసులు అల్లాడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో అప్రకటిత విద్యుత్ కోత అమలవుతోంది. మరమ్మతుల పేరుతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపిస్తుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. రాత్రి వేళ అసలు గాలిలేక ఫ్యాన్లు తిరుగుతున్నా వేడి తీవ్రతతో మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. కరెంటు ఉన్న సమయంలో ఎసిలు, కూలర్లు విపరీతంగా వినియోగిస్తున్నారు. రోజుకు 17 నుంచి 18 మిలియన్ యూనిట్లు కోటా ఉండగా 20 మిలియన్ యూనిట్లు వినియోగం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఎండ తీవ్రతకు విద్యుత్ పరికరాలుకూడా దెబ్బతింటున్నాయని, వీటిని మరమ్మతుల కోసం కొన్ని సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానియాల వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. మజ్జిగ ప్యాకెట్లు, కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, తాటిముంజలు, సపోటకు డిమాండ్ పెరిగింది. ఐస్ క్రీమ్‌ల విక్రయాలు భారీగా పెరిగాయి.

గుంటూరు, పల్నాడు

కుష్టు బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి - నరసరావుపేట/యడ్లపాడు

లెప్రసీ బాధితులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి సత్వర మార్గం చూపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు. ఇటీవల స్పందన కార్యక్రమంలో కుష్ఠ వ్యాధి గ్రస్తులు జిల్లా కలెక్టర్‌ను వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేసిన నేపథ్యంలో స్పందించిన జిల్లా కలెక్టర్ మంగళవారం యడ్లపాడు మండలం చెంఘీజ్ ఖాన్ పేట, బన్నీ నగర్ ప్రాంతంలో ఉంటున్న కుష్ఠ రోగులను పరామర్శించారు. బాధితులు పడుతున్న ఇబ్బందులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని సమస్యలను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కుష్ఠ రోగులకు ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్, ప్రత్యేక వాలంటీర్ ను ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో కుష్ఠ రోగుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమాజంలో వారి పట్ల సమాన భావన అందరిలో కలగాలన్న లక్ష్యం మేరకు అందరూ పని చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో సమీక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు డాక్టర్ జి. శోభారాణి, జిల్లా లెప్రసి, ఎయిడ్స్,టిబి నివారణ అధికారిణి డాక్టర్ కె.పద్మావతి, డిజేబుల్ సంక్షేమ శాఖ అధికారిణి సువార్త, తదితరులు పాల్గొన్నారు.

పేరేచర్ల జగనన్న కాలనీలో దారుణ హత్య

ప్రజాశక్తి - మేడికొండూరు

గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్ల జగనన్న కాలనీలో వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి శాలివాహన నగర్ కు చెందిన మంద సైదేశ్వర రావు(33) గా పోలీసులు గుర్తించారు. జగనన్న కాలనీలో జన సంచారం లేని ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు అతని తల మీద రాయితో మోదీ, కత్తితో గొంతు కోసినట్లు ఆనవాలు పోలీసులు గుర్తించారు. తీవ్ర రక్తస్రావంలో మదేహం పడి ఉంది. హత్య చేయబడిన ఆ వ్యక్తి టాటా ఏసీ డ్రైవర్ గా గుర్తించారు. హత్య చేయబడిన స్థలం సమీపంలో టాటా ఏసీ వాహనం కూడా నిలిచి ఉంది. ముందస్తు పథకం ప్రకారం వివాహేతర సంబంధ నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హత్య విషయం తెలుసుకున్న మేడికొండూరు సిఐ కే వాసు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. పలు రకాల వివరాలు సేకరించారు. క్లూస్ టీం సభ్యులు డాగ్స్ బందాలు రంగంలోకి దిగి పలు రకాల ఆధారాలు సేకరించారు. మతదేహాన్ని పోస్టుమార్టం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ కె వాసు

ఆహార కల్తీని అరికట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్న ఆహార కల్తీని నిలువరించటానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక వైపు కాలుష్యం కోరలు చాచి, ప్రజారోగానికి పెను ప్రమాదంగా పరిణమించిందన్నారు. ముఖ్యంగా వ్యవస్థాగత లోపాలే కల్తీ రాయుళ్ళకు వరంగా మారుతుందని అన్నారు. డిటర్జంట్ పొడి, యూరియా తదితరాలు కలిపి కృత్రిమ పాలు తయారు చేస్తున్న ఉదంతాలు తరచూ కనిపిస్తున్నాయని, తేనెలో బెల్లంపాకం, కాపీపొడిలో చింతపిక్కల పొడి ఇలా ప్రతిదాన్నీ కల్తీ చేస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో రోడ్డు కూడళ్ల వద్ద బిర్యానీ, పానీపూరి, బజ్జీ బళ్ల సంఖ్య బాగా పెరిగాయని, వాటిలో వాడే కారం, నూనెల నాణ్యతను ఎవరూ తనిఖీ చేయట్లేదని తెలిపారు. అధికారుల అవినీతి, అలసత్వం, నమూనాల సేకరణ ప్రక్రియను అభాసు పాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆహార పదార్థాల్లో కల్తీని గుర్తించేందుకు ఖచ్చితంగా తనిఖీలు ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆహార పరీక్షా కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ప్రజలు సైతం ఆహార కల్తీలపై అప్రమత్తంగా ఉంటూ, ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

విద్యుత్‌ఛార్జీలపై రేపు టిడిపి ప్రజాబ్యాలట్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యుత్ ఛార్జిలా పెంపు ను నిరసిస్తూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజాబ్యాలట్ నిర్వహిస్తునట్టు టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి నశీర్ అహ్మద్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన తన కార్యాలయంలో టిడిపి నాయకులతో కలసి పోస్టర్లను విడుదల చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత గత నాలుగేళ్లలో ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారని తెలతిపారు. ప్రతి ఏటా విద్యుత్ ఛార్జీలను పెంచడమే కాకుండా విడతల వారీగా మళ్లీ ట్రూ అప్ పేరుతో అదనపు భారం మోపుతున్నారని అన్నారు.

సాగుదారుల పట్ల కేంద్రం నిర్లక్ష్యం

ప్రజాశక్తి-గుంటూరు

రైతుల పంటలకు ఇచ్చే మద్దతు ధరల విషయంలో కేంద్రం తీరు చాలా నిర్లక్ష్యంగా ఉంటుందని, పండించే వారు లేకపోతే పాలకులు సైతం తిండి దొరకదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని వక్తలు పేర్కొన్నారు. అవగాహన ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో అన్నదాతకు 'గిట్టుబాటు ధర-ప్రభుత్వాల నిర్లక్ష్యం' అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో రైతు మిత్రమండలి కన్వీనర్ అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర ప్రకటిస్తే సాగుదారుల్లో భరోసా ఏర్పడాలని, భవిష్యత్ భద్రంగా ఉంటుందన్న దీమా పెరగాలని, అయితే ఈ మధ్య కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల్లో ఒక్కటంటే ఒక్క పంటకు కూడా ఎంఎస్‌పి విషయంలో సాగు పెట్టుబడి, రైతు కుటుంబ కష్టాన్ని పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు. కష్టాల సుడిగుండంలో చిక్కుకున్న రైతులకు నామమాత్రపు కనీస మద్దతు ధరతో ప్రోత్సాహం దక్కకపోగా కన్నీరే మిగిలుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలు రైతులను ముఖ్యంగా, చిన్న, సన్నకారు రైతుల్ని పచ్చి దగా చేస్తున్నాయని మండిపడ్డారు. రైతు నాయకులు బండారు శ్రీనివాసరావు, విద్యావేత్త రవిబాబు, హెచ్‌ఎం అనంతరాములు తదితరులు ప్రసంగించారు.

మాట్లాడుతున్న అచ్యుత ఇందుశేఖర్

హత్యకేసులో నిందితుడు అరెస్టు

మీడియా సమావేశంలో డిఎస్‌పి పోతురాజు

ప్రజాశక్తి - ఫిరంగిపురం :ఇంటి స్థలం దారి విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవ ముదరడంతో అన్న కొడుకును తమ్ముడు హత్య చేయడంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. మంగళవారం మీడియా సమావేశంలో తుళ్లూరు డిఎస్‌పి వి పోతురాజు వివరాలు తెలిపారు. ఫిరంగిపురం మండలం నుదురుపాడులో మండలనేని చిన్న రామరావు, మండలనేని నాగేశ్వరరావు అన్నదమ్ములు. మూడు నెలల క్రితం నాగేశ్వరరావు అన్న రామారావు దగ్గర రెండున్నర సెంట్లు ఇంటి స్థలం కొన్నాడు. ఇంటి దారి విషయంలో ఇరు కుటుంబాలకు ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ నెల 10వతేదీ రాత్రి ఇద్దరు అన్నదమ్ముల మధ్య మళ్లీ గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో అన్న కొడుకు వెంకటేశ్వర్లు గొడవలో జోక్యం చేసుకున్నాడు. ఈ క్రమంలో నాగేశ్వరరావు, అతని కుమారుడు శ్రీకాంత్ అన్న కొడుకు వెంకటేశ్వర్లుపై దాడి చేశారు. ఇనుప పైప్‌తో దాడి చేయడంతో వెంకటేశ్వర్లు (35) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. బాధితులు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం అందిన సమాచారం మేరకు మేడికొండూరు సిఐ కె వాసు, ఫిరంగిపురం ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి , సిబ్బంది నిందితులను అరెస్టు చేశారు. నిందితులను నరసరావుపేట కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఈదాడిలో గాయపడిన వారు నరసరావుపేట ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

GUNTUR MUNICIPAL CORPORATION

E-PROCUREMENT TENDER NOTICE

E.T.No. 37/2023-24, dated : -06-2023

Tenders were invited from Registered Contractors through 'e' procurement. market for various developmental works in Guntur Municipal Corporation. For further details visit www.apeprocurement.gov.in (procurement market place).
E-Procurement Tender No. 37/2023-24
Total No. of Works : 8 Nos
Total Estimate Value : Rs.1,81,93,000/-

Sd/- Executive Engineer,
Guntur Municipal Corporation.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - అమరావతి : అమరావతి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ద్విచక వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ చందులాల్ నాయక్ ప్రాథమిక చికిత్స అందించి పెద్దగా ప్రమాదం ఏం లేదని సూచించారు. మంగళవారం గంట వ్యవధిలోనే రెండు ప్రమాదాలు జరిగాయని స్థానికులు తెలిపారు.

గొర్రెలపై కుక్కలు దాడి

ప్రజాశక్తి - నాదెండ్ల : కనపర్రు గ్రామంలో మంగళవారం గొర్రెల మంద పై కుక్కల దాడి చేశాయి. గ్రామానికి చెందిన పీలా వీరాంజనేయు లకు చెందిన మూడు గొర్రెలు మతి చెందగా, మరో 14 గొర్రెలకు తీవ్ర గాయాలపాలయ్యాయి. మనుషులు, జీవాలపై ఊర కుక్కలు దాడి చేస్తున్న గ్రామ పంచాయతీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నాడు.

మంగళగిరిలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి పట్టణంలోని రాజీవ్ సెంటర్లో హెూటల్ మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదానికి గురైంది. స్థానికులు మంటలు ఒకసారి రావడంతో ఆందోళన గురై అగ్నిమాప అధికారులకు ఫోన్ చేశారు. అయితే వారు వచ్చేలోపే మంటలను అదుపు చేయడం జరిగింది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఇసుక టాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - దుగ్గిరాల : మండలంలోని గొడవర్రు గ్రామ సమీపంలో కృష్ణ నది పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుకలోడ్ చేస్తున్న రెండు ట్రాక్టర్లతో పాటు యజమానులను స్థానిక ఎస్ఐ మంగళవారం అదుపులో తీసుకొన్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు, ట్రాక్టర్లను సీజ్ చేసి, ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేశారు. ఆ సమయంలో యజమానులే అత్తోట జోజి బాబు, తుద్దపల్లి అనిల్ ట్రాక్టర్ నడుపుతున్నారని, వీరిపై కేసు నమోదు చేశారు. ట్రాక్టర్లు లోడ్ చేసిన సమయంలో పక్కా సమాచారం రావడంతో ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో దాడి అదుపులో తీసుకున్నారు.

పారిశుధ్య కార్మికుడు అదృశ్యం

ప్రజాశక్తి - తెనాలి: పారిశుధ్య కార్మికుడు అదృశ్యంపై పట్టణ 3 టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పాండురంగపేట ప్రాంతానికి చెందిన మేళం నారాయణ పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఈనెల 10న ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో వారు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ విజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ శ్రీయుత సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఒ.యస్.నెం.394/2013 ఇన్ ఐ.ఎ.నెం.1735/2015
బిట్వీన్:
షేక్ దరియాబి భర్త.రసూల్ @ రసూల్ సాహెబ్
...ప్రపోసడ్ వాది
ఎదిరి
పఠాన్ రహిమూన్ W/o బాషు ...ప్రతివాది
<u>**నోటీసు టు**</u>
పఠాన్ రహిమూన్ W/o బాషు,
శారదా కాలని, 17వ లైను,
గుంటూరు సిటి & మండలం, గుంటూరు జిల్లా.
పై నెంబరు దావాలోని ఐ.ఎ.నెం.17352015 లో ప్రపోసడ్ వాది పలుమార్లు కోర్టు వారి అనుమతితో సమన్లు పంపినప్పటికి మీరు బుద్ధి పూర్వకంగా తిరస్కరిస్తున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు బహిరంగ ప్రకటన జారీ చేయడమైనది. సదరు వాయిదా 30-06-2023న. కావున ఆ తేదిన మీరు నేరుగా గాని మీ వకీలు ద్వారా గాని హాజరై మీ వాదనలు వినిపించవలసి ఉన్నది. లేనిచో మీ పరోక్షమున శ్రీ కోర్టువారు తీర్మానించెదరు.
సత్తెనపల్లి,
తేది:14-06-2023
ఇట్లు
ఉల్లం శేషగిరిరావు,
యమ్.ఎ.,యమ్.ఎస్‌సి.,యమ్.ఎల్
న్యాయవాది.

మాట్లాడుతున్న ప్యానల్ న్యాయవాది అచ్చి ఏడుకొండలు

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపితేనే నూరుశాతం అక్షరాస్యత సాధ్యం

ప్రజాశక్తి - నరసరావుపేట

బాల కార్మిక నిర్మూలన చట్టంపై రొంపిచర్ల మండలం మాచవరం సచివాలయంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. నరసరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.నాగేశ్వరావు ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమానికి పారాలీగల్ వాలంటీర్ జి.రమేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ప్యానల్ న్యాయవాదులు అచ్చి ఏడుకొండలు, శ్రీరామినేని ప్రసాద్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను రూపుమాపితేనే నూరుశాతం అక్షరాస్యత సాధ్యమవుతుందని చెప్పారు. 14 ఏళ్లలోపు పిల్లల్ని పనులకు పంకూడదని, పనులు చేయించుకునే వారిపైనా కేసులు నమోదు చేయొచ్చని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.కరుణమ్మ, పారాలీగల్ వాలంటీర్ జి.సదీప్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి భాను, సచివాలయ సిబ్బంది హిమబిందు, యు.పార్వతి, వి.శ్రీనివాసరావు, కె.నాగమల్లేశ్వరి, డి.వెంకట్రావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మాచర్ల డిపోకు నెలకు రూ.4 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - రెంటచింతల

డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య

ఆర్టీసీ బస్సులో ప్రయాణించే వారికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని మాచర్ల డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య అన్నారు. మాచర్ల డిపోకు ప్రతినెలా రూ.4 కోట్ల వరకు ఆదాయం వస్తుందని, సిబ్బంది అంకితభావం, కృషే ఇందుకు కారణమని చెప్పారు. జిల్లాలో ఆరు డిపోలకు గాను మాచర్ల డిపో ముందంజలో ఉందన్నారు. 57 ప్రభుత్వ బస్సులు, 19 అద్దె బసులతోపాటు, ఆరు బస్సులను స్పేర్‌లో ఉంచుతామన్నారు. తమిళనాడులోని అరుణాచలం, పంచారామాలు, జగిత్యాల సమీపంలోని కొండగట్టు, పెళ్లిళ్లకు బస్సులను అద్దెకు ఇవ్వడం వలన అదనపు ఆదాయం చేకూరిందని చెప్పారు. హైదరాబాదుకు వారంలో 10 అదనపు బస్సులు నడుపుతున్నామన్నారు. మాచర్ల డిపో పరిధిలోనే విద్యార్థులకు 12వ తేదీ నుంచి రాయితీ ఉచిత బస్సు పాసుల ప్రక్రియ ప్రారంభమైందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి పాసులు ఇస్తామని చెప్పారు.

నవోదయాన్ని సద్వినియోగం చేసుకోండి : పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నరసరావుపేట

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి, వారికి విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లుగా ప్రోత్సహించేందుకు పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రతినెలా 14వ తేదీన నిర్వహిస్తున్న నవోదయం కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని బిఆర్ అంబేద్కర్ స్పందన హాలులో నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలోని చదువుకున్న నిరుద్యోగ యువత, ఉపాధి అవకాశాలు కోరుకునేవారు హాజరవ్వాలని సూచించారు.

అత్తెసరు జీతాలతో అవస్థ!

- రూ.8 వేలతో సరిపెడుతున్న ప్రభుత్వం
- ఛార్జీలు, సమావేశాలకే అధిక భాగం ఖర్చు
- సంక్షేమ పథకాలకూ నోచని వైనం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వేళాపాళా లేని పని పద్ధతులు.. చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పని చేస్తున్నామని వైకెపిలో పని చేసే విఒఎలు (యానిమేటర్లు) ఆవేదనకు గురవుతున్నారు. గ్రామాలు, పేదల వాడల్లో తిరిగి పొదుపు సంఘాల మహిళలతో గ్రూపులు కట్టించడంతోపాటు వారికి రుణాలు ఇప్పిస్తూ, వాటిని తిరిగి చెల్లించేలా ప్రోత్సహిస్తూ ఆర్థిక అంశాల్లో కీలకంగా ఉన్న తమ కుటుంబాలు గడవడం కష్టమవుతోందని చెబుతున్నారు. రూ.8 వేల వేతనం మాత్రమే వస్తుండగా పెరిగిన ధరలతో పోలిస్తే ఇదేమాత్రమూ సరిపోదని, పైగా ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదని అంటున్నారు.

మండల పరిధిలో 19 గ్రామ పంచాయతీల్లో 1,141 గ్రూపులు ఉండగా వీటిల్లో 11,726 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. సాదారణంగా 20-25 గ్రూపులకు ఒక విఒఎ ఉంటారు. ఈ లెక్కన మండలంలో 46-50 మంది విఒఎలు ఉండాల్సి ఉన్నా 36 మందే ఉన్నారు. వీరే డ్వాక్రా గ్రూపు మహిళల వద్దకు వెళ్లి పొదుపు పనులు నిర్వర్తించడం, బ్యాంకు పనులతోపాటు గ్రూపు సభ్యులు వివరాల నమోదు, ఫొటోలు తీయడం, ఆన్‌లైన్‌లో నమోదు కొత్తవారితో గ్రూపుల ఏర్పాటు వంటి పనులు వీరే చేస్తుంటారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన పనుల్లోనూ వీరిని ఉపయోగించుకుంటోంది. ఇంత చేస్తున్న వీరికి టిడిపి హయాంలో రూ.3 వేలు ఇచ్చేది. దీంతోపాటు సంఘాల నుండి రూ.2 వేలు తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుత ప్రస్తుతం రూ.8 వేలు ఇస్తున్నారని, గ్రూపుల వద్దకు వెళ్లడానికి, బ్యాంకు, వెలుగు కార్యాలయం చుట్టూ తిరగడానికి, వివిధ సమావేశాల పేరుతో ప్రతినెలా 10-15 సార్లు పెట్టే మీటింగులకు వెళ్లడానికి ఛార్జీలకే ఎక్కువగా ఖర్చవుతున్నాయని అంటున్నారు. వీటితోపాటు ప్రభుత్వ సమావేశాలు, అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాలు నిర్వహించే కార్యక్రమాలకూ వెళ్లాల్సి వస్తోందని, వీటన్నింటికీ ఖర్చులు పోను ఇక ఎంత మిగుతుంది? వాటితో తమ కుటుంబాలు ఎలా గడుస్తాయి? అని వారు ప్రశ్నిస్తున్నారు. తమ కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కల్పించే సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

క్షేత్రస్థాయిలో పని చేస్తున్న విఒఎలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి. 15 గ్రూపులకు ఒక విఒఎను నియమించి వారిపై పని ఒత్తిడిని తగ్గించాలి. ప్రభుత్వానికి ఎంతో పని చేస్తున్న వారికి ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న సదుపాయాలను వారికీ కల్పించాలి. పిఎఫ్, ఇఎస్ఐ, బీమా సదుపాయాలు వర్తింప జేయాలి.

పి.వెంకటేశ్వర్లు, సిఐటియు మండల కార్యదర్శి.

పిల్లల్ని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్చండి

- పలుచోట్ల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు
- ప్రీ స్కూల్‌పై తల్లిదండ్రులకు అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ

మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో తప్పనిసరిగా చేర్చాలని సిడిపిఒ అనురాధ కోరారు. బాలల భవితకు భాగస్వామ్యం కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయం, ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సిడిసిఒ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో విద్య, ఆటపాటలు నేర్పుతారని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో న్యూ ఫ్రీ ప్రైమరీ ఫౌండేషన్ ఇంగ్లీష్ విద్యను, పోషకాహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పిల్లలకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి.మరియకుమారి, అంగన్వాడి కార్యకర్తలు షేక్.మున్ని, ఎం.సారమ్మ, ప్రసన్న కుమారి, పద్మ, శివపార్వతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

ఐసిడిఎస్ నాదెండ్ల-యడ్లపాడు సెక్టార్ పరిధిలోని ఉప్పరపాలెం-2 అంగన్వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ అరుణ మాట్లాడుతూ ప్రీస్కూల్ ప్రాధాన్యాన్ని వివరించారు. తల్లిదండ్రులంతా తమ చిన్నపిల్లల్ని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్చాలని పౌష్టికాహారంతోపాటు విద్యార్థి దశకు పునాది అయిన ప్రీస్కూల్ విద్యను నాణ్యమైన పద్ధతుల్లో అందిస్తామని చెప్పారు. ఆటపాటలతో కూడిన విద్యనందిస్తామన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ శాంతకుమారి, ఎసిడ ిపిఒ నిర్మలరాణి, ఎంపిపి పి.ఝాన్సీ, ఎంపిటిసి అరుణ్, సర్పంచ్ వి.నరసింహారావు, సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

మండంలోని ధరణికోట బీసీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ మొహమున్నీసా మాట్లాడుతూ ప్రీస్కూల్ నిర్వహణపై వివరించారు. సింధూ, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని సాతులూరులో ఫోర్ డెవలప్మెంట్ కార్నర్ ఏర్పాటు చేసి ప్రీస్కూల్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను, అంగన్వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. సూపర్‌వైజర్ కె.పద్మ, అంగన్వాడీ టీచర్ కె.రమాదేవి, మాధవి, కల్పన, కె.విజయలక్ష్మి, సిహెచ్.విజయలక్ష్మి, హెచ్ఎం మొహమ్మద్ హదయతుల్లా, ఎఎన్ఎం రాజేశ్వరి, కావేరి పాల్గొన్నారు.

25వ రోజుకు మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె) ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రం మంగళవారం 25వ రోజుకు చేరింది. దాతలు కొత్త వెంకటేశ్వర్లు, సుమలత దంపతులు మంగళవారం మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పి.సూర్యప్రకాశరావు, పి.వీరేశం, ఎ.వెంకట్ నారాయణ, డి.వెంకటేశ్వర్లు, ఆర్.పురుషోత్తం, జి.రజని, జె.మరియమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్ ఫలితాల్లో కృష్ణవేణి ప్రతిభ

ప్రజాశక్తి - వినుకొండ

ఇంటర్ అడ్వాన్సుడ్ ఫలితాల్లో వినుకొండ కృష్ణవేణి జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపారని, పల్నాడు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారని కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.లింగరావు తెలిపారు. మంగళవారం వెలువడిన ఇంటర్ అడ్వాన్స్ ఫలితాల్లో కృష్ణవేణి కళాశాల ఎంపిసి విద్యార్థిని షేక్.జహీన 470/465, జె.కావ్య 465, సిహెచ్. హరణి 465, బైపీసీ విభాగంలో 440/433, సీఈసీ భాగంలో ఎం.తిరుపతిరావు 500/475 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ చూపారని చెప్పారు. వినుకొండలో మొట్టమొదటి నుండి విద్యార్థులకు ఎంసెట్ క్లాసులు నిర్వహిస్తూ 2022లో ఎంసెట్ ఫలితాల్లో 4418 ర్యాంకు సాధించిన ఏకైక విద్యాసంస్థ కృష్ణవేణి అని అన్నారు. విద్యార్థులతోపాటు ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించిన అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు

పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు తక్షణం చెల్లించాలి

సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబురావు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పారిశుధ్య కార్మికులకు రెండు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. మూడో నెల జరుగుతున్నా జీతాలు చెల్లించకపోతే కార్మికులు కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఈ మేరకు విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలంకు సిఐటియు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం బాబురావు మాట్లాడారు. ఎర్రని ఎండలో కార్మికులతో చాకిరీ చేయించిన సిఆర్‌డిఎ అధికారులు జీతాలు చెల్లించమంటే సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. కార్మికులు ఆందోళన చేస్తే తప్ప జీతాలు చెల్లించారా.. అని నిలదీశారు. వారం రోజుల్లో రాజధాని పారిశుధ్య కార్మికుల రెండు నెలల పెండింగ్ జీతాలు చెల్లించకపోతే కార్మికులతో కలిసి పోరాటం చేస్తామ న్నారు. పారిశుధ్య కార్మికులతో తీవ్రమైన ఎండలు, వడగాల్పులలో సైతం పనులు చేయించి, చేసిన పనికి జీతాలు చెల్లించ కుండా కాలయాపన చేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తీవ్రమైన ఎండలు, వడ గాల్పులలో పని చేస్తూ కార్మికులు కొందరు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలవడం తెలిసినా అధికారులకు కనికరం లేకుండా పోయింద న్నారు. కాంట్రాక్ట్ వర్కర్లను పర్మినెంట్ చేస్తామని చెబుతున్నారని, పర్మినెంట్ సంగతి ఏమో గానీ ముందు కార్మికులకు పెండింగ్ జీతాలు

మాట్లాడుతున్న సి హెచ్ బాబురావు

చెల్లించమని కోరారు. రాజధాని కార్మికులకు నెలల తరబడి పీ ఎఫ్ చెల్లించరని, ఈఎస్ఐ కార్డులు, కనీసం మాస్కులు కూడా ఇవ్వకపోగా కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. మీరిచ్చే అర కొర జీతాలే కార్మికులకు ఆధారమని, తాత్సారం మాని తక్షణమే జీతాలు చెల్లించాలన్నారు. కార్మికులకు జీవో ప్రకారం జీతాలు, మెడికల్ అలవెన్స్ ఇవ్వకపోగా జీతం రూ.21వేలు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ. 12 వేలు ఇస్తూ, వాటిలో కూడా మినహాయింపు పోను కార్మికుల చేతికి రూ. 10 వేలు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. వాటిని కూడా సక్రమంగా చెల్లించకపోతే కార్మికులు ఆందోళన బాట పడతారని హెచ్చరించారు. రాజధాని పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించకపోతే దశల వారీగా ఆందోళనలు చేపడుతామని అన్నారు. పారిశుధ్య కార్మికుల పెండింగ్ పీఎఫ్ కూడా కార్మికుల అకౌంట్లో జమ చేయాలని రవి కోరారు. 18 నెలలుగా పెండింగ్ పీఎఫ్ గురించి అడిగితే అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని అన్నారు. కార్మికులందరికీ ఈఎస్ఐ కార్డులు ఇవ్వలేదని, ఈఎస్ఐ కార్డులు ఇవ్వమంటే తమకు సంబంధం లేదన్నట్లుగా మాట్లాడుతున్నారని మండి పడ్డారు. ఇప్పటికైనా సిఆర్‌డిఎ ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు, కార్మికుల ఎదుర్కొంటున్న ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక సంఘం నాయకలు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి - మంగళగిరి


మాట్లాడుతున్న తహశీల్దార్ రాంప్రసాద్

మంగళగిరిలో అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ పథకంపై మంగళవారం వార్డు, గ్రామ రెవెన్యూ కార్యదర్శులకు తాసిల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తాసిల్దార్ రాంప్రసాద్ హాజరై మాట్లాడుతూ, ప్రభుత్వ భూముల క్రమ బద్ధీకరణ పై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృతి చేయాలని సూచించారు. 100 గజాలకు పైబడి 500 గజాల లోపు ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుమును ప్రజలకు వివరించాలన్నారు. 100 గజాల లోపు స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఉచితంగా డి పట్టా అంద జేస్తుందని తెలిపారు. ప్రభుత్వం నుండి స్థలాలు గృహాలు పొందిన వారు ఈ పథకానికి అనర్హులని అన్నారు. క్రమబద్ధీ కరణకు వచ్చేవారి నుండి దరఖాస్తులను స్వీకరించి ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ పథకం నియమ నిబంధ నలను క్షేత్రస్థాయిలో వివరించాలని తాహశీల్దార్ తెలిపారు.

బ్రిజ్‌భూషణ్‌ను పదవి నుంచి తొలగించాలి : ఐద్వా

ప్రజాశక్తి-గుంటూరు :మహిళా క్రీడాకారులను లైంగిక వేధింపులకు గురి చేసిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను పదవి నుంచి తొలగించి, కఠినంగా శిక్షించాలని మంగళవారం స్థానిక మంగళగిరి రోడ్డులోని కనకదుర్గ విగ్రహం సెంటర్‌లో మహిళా రెజ్లర్లకు మద్దతుగా కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, సిఐటియు నగర నాయకులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంపిని తొలగించి, మహిళా క్రీడాకారులకు న్యాయం జరిగే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎం.సుచరిత, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు టి.రాధ, సిఐటియు నాయకులు సుబ్బరాయుడు, కోలా వాసు, నక్క మస్తాన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

క్యాండిల్స్ ప్రదర్శన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గ్రంధావిష్కరణలో సాయి మాధవ్, హకీంజాని, బాబు ఆర్ వడ్లమూడి

బహుముఖ ప్రజ్ఞాశాలి ఎన్‌టిఆర్

ప్రజాశక్తి-తెనాలి

తెలుగు చలనచిత్ర రంగంలోనూ, రాజకీయాల్లోనూ నందమూరి తారక రామారావు తనదైన ముద్రవేసుకున్నారని ప్రముఖ సినీమాటల రచయిత బుర్రా సాయిమాధవ్ అన్నారు. టిడిపి వ్యవస్థాపకులు, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్‌పై పట్టణానికి చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని రచించిన 'అవతారపురుషుడు' గ్రంధాన్ని స్థానిక ముత్తెం శెట్టిపాలెంలోని విజికె అండ్ వివిఎల్ ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాపితం చేసిన ఘనుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. గ్రంధ ప్రచురణకర్త, ప్రవాస భారతీయులు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి మాట్లాడుతూ ఎన్టీఆర్ జీవిత విశేషాలను 400 చిత్రాలతో హకీంజాని రూపొందించారని ప్రశంసించారు. ఈ గ్రంధాన్ని ఎన్టీఆర్ అభిమానులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుమల్లి సింగారావు, విజికె అండ్ వివిఎల్ ఫౌండేషన్ కోశాధికారి తుమ్మల కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నివశిస్తున్న సుమారు 1800 మంది లబ్దిదారులకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. నిడమర్రు లేఅవుటల్‌లో 900 మందికి, ఐనవోలు లేఅవుట్‌లో 900 మందికి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని వారు ఉండకూడదనే ఉద్దేశంతో ఇళ్లస్థలాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇళ్లు కూడా తామే నిర్మించి ఇస్తామని హామీ నిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు, పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాల సోమిరెడ్డి, మేకా వెంకటరామిరెడ్డిపాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్లకు పెండింగ్ క్లైమ్స్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

సంతకాలు సేకరిస్తున్న నాయకులు

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లైమ్స్‌ను తక్షణమే విడుదల చేయాలని, సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) తూర్పు కమిటీ అధ్యక్షులు పి.దీవెనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మంగళవారం సంజీవయ్య సెంటర్, పాతగుంటూరు, మణిహోటల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి భవన నిర్మాణ కార్మికులకు బోర్డు నుండి రావాల్సిన సంక్షేమ పథకాలు నిలిపివేసి, ఆ నగదును ప్రభుత్వం ఇతర అవసరాలకు దారి మళ్లిస్తుందని విమర్శించారు. సంక్షేమ బోర్డును కొనసాగించాలని, ఇసుక సిమెంట్, ఇనుము మొదలైన మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వనున్నామని చెప్పారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు టి.శ్రీనివాసరావు, పఠాన్ కాజా ఖాన్, సీతయ్య, సారధి, నక్కా మస్తాన్, నరసయ్య, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయానికి ఆర్‌వో ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి తాసిల్దార్ కార్యాలయానికి రూ.80 వేల విలువచేసే ఆర్వో ప్లాంట్‌ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి శాఖ చైర్మన్ ఐ అనిల్ చక్రవర్తి బహుకరించినట్లుగా రోటరీ క్లబ్ అధ్యక్షులు టి సతీష్ బాబు తెలిపారు. ఈ మేరకు తాసిల్దార్ కార్యాలయంలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాసిల్దార్ కార్యాలయానికి, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ ప్లాంట్ ఉపయోగపడుతుందని అనిల్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ జివి రామప్రసాద్, రోటరీ క్లబ్ జిల్లా ప్రతినిధులు పివి సత్యనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ ట్రెజరర్ షేక్ సిలార్, సభ్యులు జి శ్రీనివాసరావు, కే రూపస్, పి నిరంజన్ గుప్తా, జె బిక్షారావ్, తాడికొండ ప్రకాష్, ఎన్ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడలో తాగునీరు సరఫరా చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడ గ్రామంలో ప్రజలందరికీ సమగ్రంగా మంచి నీటి సరఫరా చేయాలని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను కోరారు. మంగళవారం గుండిమెడ గ్రామంలో సిపిఎం నాయకులతో ఎఇ బొమ్మారెడ్డి కిషోర్ రెడ్డిని వెంకటరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంగా గుండిమెడ గ్రామంలో మంచినీరు సరఫరా సక్రమంగా లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వేసవికాలం తాగునీరుకి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ఎఇని వెంకటరెడ్డి కోరారు. మంచినీటి పైపులైన్లు పగిలి, మంచినీటి సరఫరాకి అంతరాయం కలిగిన అధికారులు పట్టించుకోకపోవడం వలన గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తిందని అన్నారు. స్పందించిన ఎఇ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో సుమారు రూ.20 లక్షలతో, 960 మీటర్ల పైపు లైన్లుతో పనులు ప్రారంభించామని, త్వరలోనే పూర్తిస్థాయిలో మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. మున్సిపల్ ఏఈ ని కలిసిన వారిలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, వ్యకాస తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, టిడిపి తాడేపల్లి మండల ఉపాధ్యక్షులు గుండి మెడ రమేష్ బాబు, కుమారి, తదితరులున్నారు.

ఎఇతో మాట్లాడుతున్న దొంతి రెడ్డి వెంకటరెడ్డి తదితరులు

ఇటింటి ప్రచారంలో కన్నా లక్ష్మీనారాయణ

టిడిపి అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు : కన్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు జీవితాలు అంధకారమయ్యాయని, టిడిపి అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. టిడిపి మేనిఫెస్టోపై ప్రచారాన్ని సత్తెనపల్లి పట్టణంలోని 10వ వార్డులో మంగళవారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళలు, రైతులు, యువత అన్ని సామాజిక వర్గాలకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని అన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపే హామీలు చంద్రబాబునాయుడు ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు కె.రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ వై.రామస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ ప్రాజెక్టు ఎడిఇ రామాంజనేయులు బదిలీ

ప్రజాశక్తి - రెంటచింతల

సత్రశాలలో నాగార్జునసాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఎడిఇగా పనిచేస్తున్న రామాంజనేయులను విజయవాడ సమీపంలోని గుణదల విద్యుత్ సౌదాకు బదిలీ అయ్యారు. ఈయన 2006 నుంచి సత్రశాల టైల్‌పాండ్‌లో విభాగాల్లో పనిచేశారు. ఈయన స్థానంలో విజయవాడ విటిపిఎస్ నుంచి బాషా నియమించారు.

రెండో రోజు హాజరు స్వల్పమే

ప్రజాశక్తి - రెంటచింతల

తీవ్ర ఉష్ణోగ్రతలకు పెట్టింది పేరైన రెంటచింతల మండలంలో పాఠశాలలకు రెండో రోజైన మంగళవారమూ విద్యార్థుల హాజరు శాతం తక్కువగానే ఉంది. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత నేపథ్యంలో పిల్లల్ని పాఠశాలలకు పంపడానికి తల్లిదండ్రులు వెనకాడుతున్నారు. మండలంలో 38 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 4238 మంది విద్యార్థులన్నారు. వీరికి 42 వేల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటివరకు 30 వేలు మాత్రమే వచ్చాయి. ఇదిలా ఉండగా మండలంలోని పలు సంక్షేమ హాస్టళ్లలో దోమల నివారణకు మలాథియాన్ పిచికారి చేసినట్లు మలేరియా ఆఫీసర్ అంకమ్మరావు తెలిపారు.



విద్యార్థులకు జెవికె కిట్లు పంపిణీ

ప్రజాశక్తి పెదకూరపాడు

మండలంలోని హుస్సేన్ నగరం పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. పెదకూరపాడు మండల సచివాలయాల కన్వీనర్, మండలం సర్పంచ్ సంఘాల అధ్యక్షులు, హుస్సేన్ నగరం సర్పంచ్ మాగులూరి అనిల్ కుమార్, హెచ్‌ఎం వీటిని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తం అందకే 70 శాతం మరణాలు

- రక్తదానంపై అపోహలు వీడండి
- ఆరోగ్యవంతులైన 18-60 ఏళ్ల వారెవరైనా అర్హులే
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ప్రజాశక్తి - నరసరావుపేట

రక్తదానం ప్రాణ దానంతో సమానమని, రక్తం దానంపై అపోహలు వీడి ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పనసతోటలోని పల్నాడు బ్లడ్ బ్యాంక్ అధినేత కుర్రా జానకిరామయ్య కోరారు. బుధవారం ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా తమ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రక్తదాన శిబిరంలో ప్రజలు పాల్గొని రక్తదానం చేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రజాశక్తితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. రక్త గ్రూపులను విభజించి ఆయా రక్త గ్రూపులను గుర్తించిన ఆస్ట్రేలియాకు చెందిన కార్ల్ లాండ్‌స్టీనర్ జన్మదినోత్సవాన్ని ప్రపంచ రక్త దాతల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు.

ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత

మానవ శరీరానికి ఇంధనం లాంటి రక్తం నేటి ఆధునిక జీవన విధానంలో పౌష్టికాహార లోపం, వ్యాధి నిరోధక శక్తి మందగించడం, ప్రమాదాల్లో గాయపడి రక్తస్రావం ఏర్పడినప్పుడు రక్తం కొరత ఏర్పడుతుందని రోడ్డు ప్రమాదాలు, కేన్సర్ చికిత్సలు, తలసేమియా చికిత్స, ప్రసవ సమయం లాంటి అత్యవసర చికిత్స సమయంలో రక్తం ఎంతోఅవసరం ఉంటుందన్నారు. రక్తదానం చేసేవాళ్ల ద్వారానే అత్యవసర పరిస్థితుల్లో ఇంకొకరి ప్రాణం కాపాడొచ్చని చెప్పారు. రక్తదానం చేసేందుకు ప్రజల్ని చైతన్య పరచడంతోపాటు రక్తదానం చేసే విషయంలో ప్రజలకు సరైన అవగాహన కల్పించడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు.

వెయ్యిలో నలుగురే ముందుకు..

దేశ వ్యాప్తంగా ఏటా 4 కోట్ల యూనిట్ల రక్తం అవసరమవుతుండగా 40 లక్షల యూనిట్లు మాత్రమే దొరుకుతుందని, రక్తదానం పట్ల సరైన అవగాహన లేకపోవడం వలన రక్త దానం చేసేందుకు ముందుకు వస్తున్న వారి సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. దేశ జనాభాలో 50 శాతం మంది రక్తదానం చేయడానికి అర్హులేనని, అయితే ప్రతి 1000 మందిలో నలుగురే రక్తదానం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత మరణాల్లో 70 శాతం మంది రక్తం దొరకక చనిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రక్తదానం చేస్తే నీరసించిపోతామని, బలహీనపడిపోతామనే అపోహలు వీడి ముఖ్యంగా యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు.

రూ.5 లక్షల ఉచిత ప్రమాదబీమా

ఆరోగ్యంగా ఉన్న 18-60 ఏళ్లలోపు రక్తదానం చేయడానికి అర్హులని, ఒక వ్యక్తి తన జీవితకాలంలో దాదాపు 168 సార్లు రక్తదానం చేయ్యొచ్చని చెప్పారు. చెడు అలవాట్లు ఉన్నవారు, హెపటైటిస్ బీ, సీ, హెచ్‌ఐవీ, రక్తపోటు అధికంగా ఉన్నవారు రక్తం దానం చేయడానికి అనర్హులన్నారు. ఒకసారి రక్తం ఇచ్చిన తర్వాత మహిళలైతే 6 నెలలకు, పురుషులు 3 నెలల తర్వాత మళ్లీ రక్తం ఇవ్వొచ్చని, ఒకసారి రక్తదానం చేస్తే ముగ్గురికి ప్రాణ దానం చేసిన వారు అవుతారని చెప్పారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకునిరక్త దాతలను ప్రోత్సహించడంతో పాటు రక్తదానం పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారికి తమ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల ఉచిత ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు.



36వ సారి రక్తదానం చేస్తున్న పల్నాడు బ్లడ్ సెంటర్ నిర్వాహకులు కె.జానకిరామయ్య

ఆ వార్తలు అవాస్తవం : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి - నరసరావుపేట

సిఎం జగన్మోహన్‌రెడ్డి గత సోమ వారం పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు సభకు వస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు ఎదురు వచ్చి తన బిడ్డ సమస్యను చెప్పుకునేందుకు ప్రయత్నించిన అచ్చంపేట మండలం ముత్యాలును సెక్యూరిటీ సిబ్బంది పక్కకు లాగేశారనే వార్తల్లో వాస్తవం లేదని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కాన్వాయ్ నుంచి ఆమెను వారి కుమారుడు పువ్వాడ సాయిని సిఎం వద్దకు తీసుకెళ్లారని, వారితో సిఎం మాట్లాడి విరిగిన చేయికి రూ.లక్షతోపాటు ఎప్పటికప్పుడు ఫిజియోథెరపీ చేయించాలని తనను ఆదేశించారని వివరించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్

కార్యాలయంలో పువ్వాడ సాయి కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా రూ.లక్ష చెక్కు అందించడంతోపాటు ఫిజియోథెరపీ అధికారులను ఆదేశించామని చెప్పారు. అత్యాధునిక వైద్య చికిత్స నిమిత్తం సిఎం సహాయ నిధికి సిఫారసు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన మరో 21 మందికి తక్షణ సాయంగా రూ .32.50 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు అవసరమైన వారికి అత్యాధునిక వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

మినీ మేనిఫెస్టోపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - నరసరావుపేట

భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో ఇంటింటికి చదలవాడ కార్యక్రమాన్ని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమ వారం రాత్రి మండలంలోని రావిపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థి, మహిళ లు, రైతులకు నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి టిడిపి మినీ మేనిఫెస్టో తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రాని సమస్యల సుడిగు ండలోకి వైసిపి నెట్టిందని, అన్న క్యాంటీన్ మూసి పేదల పొట్ట కొట్టిందని విమర్శి ంచారు. రాష్ట్రంలో గంజాయి, కల్తీ మద్యం, గుట్కా మాఫియా చెలరేగిపో

తున్నాయన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్ర మంలో టిడిపి నాయకులు వి.వెంకట నర్సయ్య, జి.కోటేశ్వరరావు, డి.ఉదయశ్రీ, పి.సునీల్, వి.సింహాద్రి యాదవ్, కె.కోటిరెడ్డి, శివప్రసాద్, బి.విశ్వేశ్వరరావు, కె.రమేష్, ఫ్రాన్సిస్, కన్యరాజు, పి.హృదయరాజు, ఎం.రాజేష్ పాల్గొన్నారు.

ఫిట్నెస్ లేని బస్సులు నడిపితే కఠిన చర్యలు

- 150 బస్సులు రెన్యువల్ చేసుకోవాలి
- వాహనాల్లో పత్రాలన్నీ ఉండాలి
- జిల్లా రవాణా శాఖాధికారి టి.కె పరందామరెడ్డి

ప్రజాశక్తి - నరసరావుపేట

విద్యా సంస్థలు పున:ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో ఉన్న పాఠశాలు, కళాశాలల బస్సులు ఫిట్‌నెస్ సరిగా ఉండేలా యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా రవాణా శాఖాధికారి టి.కె. పరందామరెడ్డి చెప్పారు. ఇప్పటికే 20 రోజుల నుండి విద్యా సంస్థలకు చెందిన బస్సుల సామర్థ్యంపై నిర్వహిస్తున్న పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ప్రతి స్కూల్ బస్సు ఫిట్నెస్ సర్టిఫికెట్, పర్మిట్, టాక్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు.

జిల్లాలో 800 స్కూల్ బస్‌లకు గాను 650 బస్‌లకు ఫిట్నెస్ రెన్యువల్ చేశామని, మిగిలిన వారు కూడా తక్షణమే ఫిట్నెస్ రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. ఫిట్నెస్ లేకుండా తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడమే

కాకుండా అధికంగా జరిమానా విధిస్తామేని హెచ్చరించారు.

ఎ.పి.మోటార్ వెహికల్ చట్టం లోని రుల్ నం 185(జీ)లో రూపొందించబడిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. డ్రైవర్ వయస్సు 60 ఏళ్లు దాటరాదని,

ఐదేళ్ల అనుభవం ఉన్న వారిని మాత్రమే డ్రైవర్‌గా నియమించాలని, డ్రైవర్ వివరాలను బస్‌లో ఉంచాలని అన్నారు. డ్రైవర్ కంటి చూపునకు సంబంధించిన వైద్య పరీక్షలను యాజమాన్యం తరచూ చేయించాలని, అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్ని మాపక పరికరం ప్రతి వాహనంలో ఉండాలని చెప్పారు. ప్రతిబస్‌లో ఒక సహాయకుడు ఉండాలని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడటం, మద్యం సేవించడం వంటివి చెస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యా సంస్థల బస్సులపై నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు.

పాఠశాలల్లో జెవికె కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మార్చి, విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు జెడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు(జెవికె) పంపిణీని మంగళవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితికి, వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలలు అభివృద్ధికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు సిఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పాఠశాలల పున:ప్రారంభం నాటికే జెవికె కిట్లను అందిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట జెడ్పీటిసి పిల్లి ఉమా ప్రణతి, మండల విద్యాధికారి ఎం. లక్ష్మీ నారాయణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు అన్నారావు, తదితరులున్నారు.

ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో..

స్థానిక ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో విద్యార్థులకు జెవికె కిట్లను కౌన్సిలర్ గెడ్డటి సురేంద్ర చేతుల మీదుగా అందించారు. ప్రధానోపాధ్యాయిని ప్రసూనాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సురేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకోసం ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లక్ష్యాన్ని ఎంచుకుని చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శర్మ, ప్రకాశరావు, హబీబ్ భాషా, సునీత,రాయన్న పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో జెవికె కిట్ల పంపిణీ

కొలకలూరు జెడ్పీహెచ్ఎస్‌లో జెవికె కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు బోధన కిట్లు

ప్రజాశక్తి-గుంటూరు : పిల్లలకు తల్లి మొదటి గురువు అని, తాము అందచేసిన ఉపకరణాలను వినియోగించుకుంటూ విద్యను బోధించాలని గుంటూరు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం గుంటూరు బ్రాడీపేటలోని ప్రత్యేక అవసరాల విద్యా విభాగం, భవిత సెంటర్‌లో బోధన ఉపకరణాల సామాగ్రిని పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రం, సికింద్రాబాద్‌లోని నిప్పిడి సంస్థ అందచేస్తున్న ఎంతో విలువైన బోధన ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవటం ద్వారా బుద్ధి మాంధ పిల్లలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవటానికి వీలుంటుందన్నారు. జాతీయ మేధోపరమైన సాధికార సంస్థ ప్రతినిధి రామాంజనేయులు, యం.మల్లిఖార్జున నాయక్ మాట్లాడుతూ పిల్లల వయసు వారీగా మూడు రకాలుగా అందజేయటం జరుగుతుందని, జిల్లాలో 90 కిట్లు మంజూరు చేశామని, ఒక్కొక్కరికి రూ.10వేల విలువైన సామాగ్రిని పంపిణీ చేసినట్లు చెప్పారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి ఇలాంటి కిట్లను అందచేస్తున్నామని తెలిపారు. ఎఇఆర్‌పిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ చేస్తున్న ఏపిసి విజయలక్ష్మి తదితరులు

వసతి గృహాల్లో దోమల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - తెనాలి

వ ం లో రి య ా మాసోత్స వాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని మారీస్ పేట, రావి రవీంద్ర నాథ్ నగర్ లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, ఎస్సీ బాలికల వసతి గృహాలు 1,2లో తెనాలి మలేరియా యూనిట్ ఆధ్వర్యంలో దోమల నియంత్రణకు మలాథియాన్ ఇండోర్ రెసిడ్యువల్ మందును స్ప్రే చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, ఇన్చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ బండి విజయ్ కుమార్, వసతిగృహ సంక్షేమాధికారిణి రామనాథం ప్రమోదిని, కంచర్ల రజిని, పట్టణ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్. ఉమాకాంత్ పాల్గొన్నారు.

దోమల మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

సీతారామపురంలో ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం సీతారామపురంలో మంగళవారం ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. గ్రామంలోని ఉదయం ఆరు గంటలకే కూలీలు గ్రామ శివారులోని నండూరు ఛానల్ పూడికతీత పనులు ప్రారంభించారు. గ్రామ శివారు చెరువు మట్టి పనులు చేశారు. ఉపాధి హామీ పనులు కొలతల కూలీల మాస్టర్లను టెక్నికల్ అసిస్టెంట్ రత్నరాజు పర్యవేక్షించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఆయన తెలిపారు.

కౌలు రైతుకు భూ యజమాని సహకరించాలి

19వరకు అవగాహన సదస్సులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రతి కౌలు రైతు సాగుదారు కార్డు పొందే విధంగా భూ యజ మానులు సహకరించాలని పెదనందిపాడు తాసిల్దార్ షేక్ మహబూబ్ సుభాని అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రచురించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం నుండి అందే పథకాలు, బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఆర్‌బికెల వద్ద అవగాహన సదస్సులు నిర్వహించి కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులను అందజేస్తామని, భూ యజమానులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే నేటినుండి 19వ తేదీ వరకు మండలంలోనీ ప్రతి గ్రామంలోనూ గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షేక్‌హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్ యెహుషువ, డిబిఆర్‌సి ప్రాంతీయ సమన్వయ కర్త వి భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై నేడు అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రపంచ రక్తదానం దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో పట్నంలో గల విజేపి అండ్ డి ఎల్ బి డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లుగా ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి శాఖ కార్యదర్శి ఏ జయరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో గల ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

స్మార్ట్ క్లాస్‌రూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి :పట్టణంలోని సీతానగరం రామకృష్ణ హైస్కూల్లో మంగళవారం స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను హైదారాబాద్ డెక్కన్ క్లబ్ డేర్ ప్రాజెక్టు చైర్మన్ మురళి త్రిపురనేని ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ సంయుక్తంగా ఇందుకు నిధులు చేకూర్చాయి. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులు ఆళ్ల రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల పిల్లలు అధికంగా విద్యనభ్యసిస్తున్న రామకృష్ణ మిషన్ హైస్కూల్‌కు డిజిటల్ బోర్డు ఇవ్వడం తమకు ఆనందంగా ఉందని చెప్పారు. డేర్ ప్రాజెక్టు తరుపున 15 రోజుల్లో ఈ ప్రాజెక్టును అప్రూవల్ చేయడం జరిగిందని మురళి త్రిపురనేని చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపల్ సుధాకర్, రోటరీ క్లబ్ ఆఫ్ అధ్యక్షులు తాడేపల్లి మున్నంగి వివేకానందరెడ్డి, ఎస్.రామకృష్ణ, చంద్ర, ఓబులారెడ్డి, డి.కిరణ్, ఆర్.శ్రీనివాస్ ఎస్.రమేష్, జి.శివ, జె.ప్రభాకర్‌రెడ్డి, బసివిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి

జన్‌భగీరది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సూపర్‌వైజర్ వేణుకుమారి అవగాహన కల్పించారు. 3 నుంచి 4 సంవత్సరాల పిల్లల అభివృద్ధి గురించి, పిల్లలను ప్రీ స్కూల్‌కు పంపడం ద్వారా వారు మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందుతారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ మెటీరియల్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శకుంతల, అంగన్‌వాడీ వర్కర్లు సుజాత, విక్టోరియా, రాణి పాల్గొన్నారు.

దేవాలయాలను దోచుకున్నారు

ప్రజాశక్తి-తాడేపల్లి

చంద్రబాబు ప్రభుత్వంలో దేవాలయాలను కూడా దోచుకున్నారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు విమర్శించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో కాపులపై జరిగిన దుర్మార్గాలను గతంలో ఎన్నడూ చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పవన్ వారాహి యాత్ర, చంద్రబాబు కుప్పం యాత్ర లోకేష్ వరాల యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లు ఏమైపోయారని ప్రశ్నించారు. కరోనా సమయంలో ఎక్కడున్నారని నిలదీశారు. చంద్రబాబును గెలిపించడానికే జనసేన ఉందని విమర్శించారు.

మాట్లాడుతున్న అడపా శేషు

ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ పేరుతో

పేదలను మోసం చేస్తున్న ఎమ్మెల్యే : టిడిపి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ పేరుతో పేదలను మోసం చేయడానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రయత్నిస్తున్నారని టిడిపి నాయకులు విమర్శించారు. మంగళవారం సాయంత్రం మంగళగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ టిడిపి అధికారంలోకి వస్తే నియోజవర్గంలో 20వేల ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టిస్తామని హామీ ఇవ్వడంతో, ఆ భయంతో ఎమ్మెల్యే ఆర్కే క్రమబద్ధీకరణ పేరుతో మోసం చేయడానికి వస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు వరకు గుర్తురాని క్రమబద్ధీకరణ ఇప్పుడు ఎందుకు గుర్తొచ్చిందని ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ పేదలను మోసం చేయడానికి చూస్తున్నారన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, టి జానకి దేవి, తోట పార్థసారథి, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబును నమ్మొద్దు'

ప్రజాశక్తి-తాడేపల్లి

తమ ప్రభుత్వంలోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని మాదిగ కార్పొరేషన్ కొమ్మూరి కనకారావు చెప్పారు. తమ జాతికి ద్రోహం చేసింది చంద్రబాబు అని, ఆయన్ను నమ్మవద్దని కోరారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆత్మీయ సమావేశం అంటూ మాదిగల ఆత్మఘోష చెప్పుకోవడం తప్ప అక్కడ ఒరిగేదీ ఏమీలేదని అన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - తెనాలి

విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుంటూరు విజిలెన్స్ ఈఈ కెవిఎల్ఎన్ మూర్తి, తెనాలి ఈఈ వివి చిరంజీవితో పాటు 61 బృందాలు ఆధ్వర్యంలో డి3 సెక్షన్ పరిధిలో మొత్తం 4593 సర్వీసులు పరిశీలించారు. పరిమితికి మించిన లోడును వినియోగిస్తున్న 164 సర్వీసులకు రూ.4,54,434, అలాగే మాల్‌ప్రాక్టిస్ కేసులు 5 నమోదు చేసి, వారికి రూ.25 వేలు అపరాధ రుసుము విధించినట్లు ఈఈ చిరంజీవి తెలిపారు. తనిఖీల్లో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాజధాని దళితల సంక్షేమం పట్టని సిఎం

ప్రజాశక్తి - తుళ్లూరు :రాజధాని ప్రాంతం తుళ్లూరులో మంగళవారం తాడికొండ నియోజకవర్గ టిడిపి నాయకులు పులి చిన్నా అధ్వర్యంలో ర్యాలీ జరిపారు. మంగళగిరిలో టిడిపి - మాదిగల ఆత్మీయ సమావేశంకు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. స్థానిక లైబ్రరీ సెంటర్ దగ్గర నుంచి బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నా మాట్లాడుతూ మాదిగల సంక్షేమానికి టిడిపి అధినేత చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం రాజధాని లోని దళితులను వంచించిందని అన్నారు. రాష్ట్రం లోనూ దళితులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో దళితులు టిడిపిని ఆదరించాలని కోరారు.

తుళ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

లాం ఫారంలో మిరప విత్తనాలు విక్రయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరుకు సమీపంలోని లాం ఫాంలో ఈనెల 15వ తేదీనుంచి మిర్చి విత్తనాలను విక్రయిస్తున్నట్టు ఉద్యాన పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త కె. గిరిధర్ తెలిపారు. వై.యస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధనా స్థానం, లాం, ఆధ్వర్యంలో ఎల్.సి.ఎ 657, ఎల్.సి.ఎ 643 మిరప రకాలు ఫౌండేషన్ విత్తనాలు అమ్మకానికి పెడుతున్నట్లు తెలిపారు. ఎల్.సి.ఎ 657 రకాలు తమ యూనివర్సిటీ ద్వారా రూపొందించామని ఈ రకం కాయలు పొడవుగా ముదురు ఆకుపచ్చ రంగుతో ఉండి పండినప్పుడు ముదురు రంగుతో తెల్లటి తొడిమ కలిగి ఆకర్షణీయంగాఉంటాయన్నారు. ఈ విత్తనాలు జెమిని వైరస్ ను (బొబ్బర) కొంత వరకు తట్టుకుంటుందన్నారు. ఎల్.సి.ఎ 643 రకం పొడవుగా ఎండుకాయలు కడ్డీ బ్యాడిగ వలె ముడతలు కలిగి ప్రకాశ వంతమైన ఎరుపు రంగుతో ఘాటుగా వుంటాయన్నారు. ఈ రకం కొంతవరకు జెమిని వైరస్ ను బెట్టను తట్టుకొని, నల్లతామర ఆశించినా కూడా మంచి దిగుబడి ఇస్తుందన్నారు. ఈ రకాల విత్తనాలు కొనదలిచిన రైతులు నేరుగా ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా !! కె. గిరిధర్ గారు మాట్లాడుతూ పైన తెలియజేసిన మిరప విత్తనాలు కేవలం ఒక రైతుకు 100 గ్రాములు మాత్రమే ఇవ్వగలమని తెలియ జేశారు. 100 గ్రాముల విత్తనం ప్యాకెట్ ధర రూ. 120 అని తెలియ జేశారు. ఈ విత్తనాలతో నారు పెంచుకుని నాటు వేసుకోవలసిందిగా విజ్ఞప్తి చేసారు.

వధాన్యులైన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత శిబిరం

ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న నూరి ఫాతిమా

ప్రజాశక్తి-గుంటూరు :వధాన్యులైన్ ప్రైవేటు ఆసుపత్రులు అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నాయకులు షేక్.మహమ్మద్ నూరి ఫాతిమా కోరారు. మంగళవారం స్థానిక కొత్తపేట ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో తులసీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీచైతన్య ఐక్లినిక్, వారాహి డెంటల్ హాస్పిటల్ నేతృత్వంలో సాధారణ వైద పరీక్షలతోపాటు, బిపి, షుగర్, కంటి దంత పరీక్షలకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నూరి ఫాతిమా మాట్లాడుతూ ప్రజలకు వైద్యం భారం అవుతున్న నేపథ్యంలో ప్రజల వద్దకే ఆసుపత్రులు వచ్చి సేవలు అందించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పిచ్చుల జయప్రకాష్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 400 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి దేవీ శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకటజ్యోతి, నరేష్‌కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటేశ్వరత్నం, శ్రీనివాసులు, అనిత శివకుమారి పాల్గొన్నారు.

ఉన్నత ప్రమాణాలతో కొనసాగుతున్న వర్సిటీ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిశోధనల ప్రగతి నివేదికను గవర్నర్‌కు అందజేసిన విసి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విద్యా పరిశోధనల ప్రగతి నివేదిక 2022-23 ను రాష్ట్ర గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ కులపతి ఎస్ అబ్దుల్ నజీర్‌కు వర్సిటీ వీసీ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ అందజేశారు. మంగళవారం గవర్నర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విలువలతో కూడిన విద్యా బోధన, విషయ పరిశోధనల ప్రమాణాలు పరంగానూ, విద్యార్థులలో వినూత్న ఆలోచనలకు, నూతన ఆవిష్కరణల పరంగానూ, కొత్త సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే విధంగా పాఠ్య ప్రణాళికలను తయారు చేసిందని తెలిపారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల్లో విద్యార్థులు మంచి ఉద్యోగాలను సాధించే విధంగా, రూపొందించిన పాఠ్య ప్రణాళిక ద్వారా బోధనా ప్రమాణాలతో వారి పరిశోధనలకు తర్ఫీదు ఇస్తున్నట్లు ఉపకులపతి తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లో ఉన్న అన్ని విభాగాలలో నూ ఉన్నత ప్రమాణాలతో మౌలిక వసతులతో కూడిన స్మార్ట్ తరగతి గదులు, బోధన, పరిశోధన, మంచి వసతులు కలిగిన గ్రంథాలయ విభాగము, విద్యార్థులందరికీ అందుబాటులో ఉచిత ఇంటర్నెట్ సౌకర్యాలు కలిగి ఉన్నాయని తెలిపారు. వర్సిటీలో వసతులు పరిశీలించిన ప్రముఖ ప్రపంచ శ్రేణి సంస్థలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని అత్యుత్తమ శ్రేణి ర్యాంకులతో గుర్తించాయన్నారు. దూరవిద్యా కేంద్రం భారతదేశంలోనే అత్యంత నాణ్యమైన దూర విద్యను అందించే మూడవ ప్రముఖ కేంద్రంగా గుర్తించబడింది అని తెలియచేసారు. ఇటీవల ప్రకటించిన ద ఇంపాక్ట్ 2023 ప్రపంచ శ్రేణి ఉన్నత విద్య సంస్థలకు ప్రకటించిన రాంకింగ్స్ లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర లో ప్రథమ స్థానంలో నిలిచింది అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య డా. పి. వరప్రసాద్ మూర్తి , రిజిస్ట్రార్ ఆచార్య డా. బి. కరుణ , ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డా. సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ శ్రీ నజీర్ అహ్మద్ విశ్వవిద్యాలయ ఉన్నత అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నిరుద్యోగులకు మినీ జాబ్‌మేళా

పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు

ప్రజాశక్తి - నరసరావుపేట : డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ ట్రైనింగ్ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె. సంజీవరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ వద్ద బుధవారం జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నరసరావుపేట పరిసర ప్రాంత యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిన్ కేర్ బ్యాంక్, హెటిరో డ్రగ్స్, స్కిల్ క్రాఫ్ట్ మరియు టీవీఎస్ యూనిటీ, మోటార్ వర్క్స్ వంటి పలు రకాల కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. విద్యా అర్హతను బట్టి రూ .10 వేల నుండి రూ .30 వేల వరకు వేతనాలు ఉంటాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బి.టెక్, డిప్లమా, ఫార్మసీ మరియు పీజీ విభాగాల వరకు చదువుకున్న 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా విద్యార్హత పత్రాలతో హాజరు కావాలన్నారు. ఉదయం 9.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు మేళా జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న అరుణ్ కుమార్

పోటీని పరిశీలిస్తున్న లక్ష్మణరావు, డి రమాదేవి తదితర నాయకులు

బహుమతి అందిస్తున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు, తదితరులు

ఉత్సాహంగా చేగువేరా మెమోరియల్ చెస్ పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

చేగువేరా మెమోరియల్ చెస్ టోర్నమెంట్ విజేతగా ఎం.డి. ఇమ్రాన్ నిలిచాడు. పి.హరి సాయిరామ్ ద్వితీయ స్థానం, సీతా సాగర్ కొనపర్తి మూడవ స్థానం సాధించాడు. విజేతలకు ఒకొక్కరికి రు. 10వేలు, రు. 8వేలు, రు. 8వేలు నగదు బహుమతులను అందచేశారు. నగరంలోని ఎంబి భవన్‌లో చేగువేరా జయంతి సందర్భంగా విజయవాడ ఎంబివికెలో నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల నుండి సుమారు 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్సాహభరితంగా పోటీలు జరిగాయి. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు శాసన మండలి సభ్యులు కె.యస్. లక్ష్మణరావు బహుమతులను అందచేశారు. ఈకార్యక్రమంలో పాపులర్ షూ మార్టు అధినేత అరుణ్ కుమార్, అమరావతి బాలోత్సవ్ గౌరవాధ్యక్షులు చలువాది మల్లిఖార్జునరావు, నిర్వహణా కమిటీ సభ్యులు ఎస్.పి. రామరాజు, రమాదేవి, చీఫ్ ఆర్బిటర్ రాజీవ్ ఎం. అక్బర్ పాష, జీ. రామన్న, సతీష్, శ్రీనివాస్, క్రాంతి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యత పెంచుకోవాలి

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యతను పెంచుకుని మంచి క్రీడాకారులుగరా ఎదగాలని రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని పలువురు వక్తలు అన్నారు. చేగువేరా 95వ జయంతి సందర్భంగా చేగువేరా మెమోరియల్ రాష్ట్ర చెస్ టోర్నమెంట్ బుదవారం ఉదయం నగరంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఉదయం ప్రారంభమైంది. ఈటోర్న మెంట్‌ను తొలుత ఉమెన్ గ్రాండ్ మాస్టర్ ప్రియాంక ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ విజయవాడ నగరంలో చేగువేరా పేరుతో రాష్ట్రస్థాయి పోటీలు జరగడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని అన్నారను. తాను కూడా తొలుత ప్రతి టోర్నమెంట్‌లోనూ ఆడేదానినని అన్నారు. అలాగే క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడల్లో రాణించడమే గొప్పగా భావించాలన్నారు. చెస్ క్రీడ మంచి విజ్ఞానంతో పాటు ఆసక్తిని కలిగిస్తుందన్నారు. చెస్ అంటే తనకు ఎంతో ఇష్టమని ఇష్టంతోనే ఆడానని అందుకే తాను ఉమెన్ గ్రాండ్ మాస్టర్ స్థాయికి వెళ్లినట్లు తెలిపారు. శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక అంశాలు కూడా అవసరం అన్నారు. క్రీడలపై ఆసక్తి పెంచుకుని సాధన చేస్తే మంచి క్రీడాకారులుగా తయారుకాగలరని తెలిపారు. యువతీ యువకులకు ఐకాన్‌గా సుపరిచితులైన చేగువేరా పేరుతో రాష్ట్ర స్థాయిలో చెస్ పోటీలను నిర్వహించడం పట్ల నిర్వాహ కులను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున జరగాలని అన్నారు. పోటీలను నిర్వహించాలని అనుకున్న చాలా తక్కువ సమయంలోనూ

ఎక్కువ మంది సుమారు 180 మంది క్రీవడాకారులు పాల్గొనడం అభినందనీయమని అన్నారు. విజేతలైన క్రీడాకారులకు రు. 40వేల ప్రైజ్‌మనీతో పాటు 25 మందికి మెమోంటోలు, సర్టిఫికెట్లు కూడా ఇవ్వనున్నారని అన్నారు. చేగువేరా చెస్ పోటీల నిర్వహణ కమిటీ అధ్యక్షులు, పాపులర్ షఉ మార్టు అధినేత చుక్కపల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ యువతకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించాలనే ఉద్దేశంతోనే ఈపోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలను ఉమెన్ గ్రాండ్ మాస్టర్ ప్రియాంక పోటీలను ప్రారంభించారని అన్నారు. ముఖ్యంగా యువత చదువుతో పాటు తమకు ఇష్టమైన ఏదో ఒక ఆటలో ప్రావీణ్యతను పెంచుకోవాల్సిన అవసరం నేడు ఎంతయినా ఉందన్నారు. నిర్వహణా కమిటీ కన్వీనర్ జి.రామన్న, మాట్లాడుతూ ఎపి చెస్ అసోసియేషన్, ఎన్‌టిఆర్ జిల్లా చెస్ అసోసియేషన్ ససహకారంతో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నిర్వహణా కమిటీ సభ్యులు డి.రమాదేవి, నక్కా వెంకటేశ్వర్లు, టి.క్రాంతి కిరణ్, శ్రీనివాస్, అశోక్, యు.వి. రామరాజు తదితరులు పాల్గొన్నారు.